క్లుప్తంగా

బట్టీలో 'బడి' ప్రారంభం


ఏర్పాటు చేసిన పాఠశాలలో అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుగ్గగట్టు సమీపంలోని ఇటుక బట్టీల్లో సోమవారం ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా వలస కార్మిక పిల్లల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఆపరేషన్ స్మైల్ బృందం ఇటుక బట్టీల్లో విస్తృతంగా పర్యటించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుల పిల్లలు చదువుకోకుండా ఇటుక బట్టీల్లో ఖాళీగా ఉంటున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సోమవారం వీరి కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేసి వారికి పలకలు, నోట్‌బుక్స్ అవసరమైన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పోచయ్య, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై విజయ్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఇందిర, హెడ్ కానిస్టేబుల్ మునావర్, ఏఎస్సై నాందేవ్, కానిస్టేబుళ్లు ప్రమీళా, రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: నీల్వాయి సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. వేమనపల్లి ఫీడర్‌లోని గొర్లపల్లి, దస్నాపూర్, వేమనపల్లి, మంగెనపల్లి, ఒడ్డుగూడం, సుంపుటం, జాజులపేట, కళ్లంపల్లి, ముక్కిడిగూడ గ్రామాలకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024-25సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడిందని టీఎస్ మోడల్‌స్కూల్ మంచిర్యాల ప్రిన్సిపాల్ రజని తెలిపారు. 6వ తరగతిలో 100సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 22వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ


ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

లక్సెట్టిపేట: స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ గౌతం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఊట్నూరులో నిర్వహించిన ఏడో ఇంటర్ సొసైటీ లీగ్ క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్, బాక్సింగ్, ఇతర విభాగాల నుంచి 11 బంగారు పతకాలు, 9వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యావరణమిత్ర బట్టసంచులనే వాడాలి

కోటపల్లి: పర్యావరణ, జీవవైవిధ్యానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు పర్యావరణమిత్ర బట్ట సంచులనే వాడాలని పార్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం గ్రీన్‌కోర్ జిల్లా కో ఆర్డినేటర్ యోగేశ్వర్ అన్నారు. పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు భారత పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు చెందిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే సందేశంతో ఉన్న సంచులను విద్యార్థులకు అందజేశారు. గ్రీన్ టీచర్ సతీశ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పావని, బిక్కు, నర్సింగ్, వాణిశ్రీ, విలాస్ జాదవ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

చెన్నూర్‌రూరల్/వేమనపల్లి: చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ దాటిన తర్వాత క్రషర్ ఏర్పాటు చేశారని, దీంతో ఇళ్లలోకి దుమ్ము చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వేమనపల్లిలో ఎలాంటి అర్జీలు రాలేదని ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు.

కార్యవర్గం

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం కొత్త కమిటీని ఎంపిక చేశారు. టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా బి.దేవదాస్ ఎన్నికయ్యారు.


విలేజ్ నస్పూర్‌లో పూజలు


మంగళసూత్రం చూపుతున్న పూజారి


మాదారం కోదండ రామాలయంలో కుంకుమ పూజలు


నర్సింగాపూర్‌లో శోభాయాత్ర


కన్నెపల్లిలో శోభాయాత్ర


నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు


కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


కిష్టంపేట హనుమాన్ ఆలయంలో...


బెల్లంపల్లి: హాజరైన జడ్జి దంపతులు

అంతా రామమయం..!

- మార్మోగిన రామనామ స్మరణ
- ఘనంగా సీతారాముల కల్యాణం
- అంగరంగా వైభవంగా శోభాయాత్ర
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

భీమారం/బెల్లంపల్లి/మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/కాసిపేట/బెల్లంపల్లిరూరల్/మందమర్రిరూరల్/కోటపల్లి/భీమిని/చెన్నూర్/జైపూర్/నెన్నెల/జన్నారం/రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/చెన్నూర్‌రూరల్/నస్పూర్/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి(తాండూర్)/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు నియమ నిష్ఠలు పాటిస్తూ, సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక భజన కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం, రాములోరి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్రలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు కాషాయం, తెలుపు రంగు దుస్తులు ధరించి, కాషాయ జెండాలతో జై శ్రీరామ్ నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. పల్లెలన్నీ రామనామ స్మరణతో మార్మోగాయి. ఆలయాల ఆవరణలో బిగ్ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి బాల రాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. భీమారం కోదండరామాలయంలో ఎమ్మెల్యే వివేక్, మందమర్రిలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, బెల్లంపల్లిలో స్థానిక జూనియర్‌సివిల్ జడ్జి ముఖేష్ దంపతులు, ఏసీపీ పంతాటి సదయ్య, మంచిర్యాలలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే 6 కాలనీలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు హాజరయ్యారు. పాత మంచిర్యాలలో భక్తంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్ స్వామి, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో శోభాయాత్ర


నెన్నెలలో పూజలు


భీమారం: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్


కాసిపేట: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


లక్సెట్టిపేటలో శోభాయాత్ర


కోటపల్లి: కీర్తనలు ఆలపిస్తున్న భజనభక్తమండలి


దండేపల్లి: రాములోరి పల్లకి సేవలో భక్తులు


చెన్నూర్ మహేశ్వరి భవన్‌లో మార్వాడీ కులస్తులు



జైపూర్‌లో వేషధారణలో భక్తులు


యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


కల్యాణవేడుకలో జీయర్‌స్వామి, దివాకర్‌రావు


శ్రీరాంపూర్: శోభాయాత్ర నిర్వహిస్తున్న కార్మికులు


దండేపల్లిలో ముగ్గులో వెలిగించిన దీపాలు


చింతపండు వాడ హనుమాన్ టెంపుల్ వద్ద..


చెన్నూర్‌లో శోభాయాత్రకు అధిక సంఖ్యలో హాజరైన భక్తజనం


మంచిర్యాల టౌన్: పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

భీమారం/చెన్నూర్: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీటం వేస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలో విద్యాశాఖ కృషితో రూ.31లక్షలతో నిర్మించిన మానవ వనరుల కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. భీమారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని తహసీల్దార్ విశ్వంభర్‌ను ఆదేశించారు. వారం రోజుల్లో అంబులెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలు ముగియగా, ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆర్పీల సంక్షేమ సంఘం నాయకురాళ్లు భూమక్క, జువ్వాజి రేణుక తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయా కార్యక్రమంలో భీమారంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, చెన్నూర్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్, ఆర్పీలు కుందారపు లక్ష్మీ, సరిత, రజిత, రాజమణి, మహేశ్వరి, హేమలత, కల్పన, సుధారాణి, లెక్చరర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


భీమారం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

జైపూర్: హన్‌మాన్ ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నదానం చేశారు. అనంతరం జైపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి గడ్డం కాకా స్నేహితులు సిద్ధం చంద్రయ్య ఆరోగ్యక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎస్టీవో కార్యాలయం ఆవరణలో సోమవారం టీఎస్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి వేణుగోపాల్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు స్వీకరించాలని, అందరూ సమావేశాలకు హాజరుకావాలని తెలపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం వీడి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని మంచిర్యాల జిల్లా రవాణా శాఖఅధికారి(డీటీవో) ఎల్.కిష్టయ్య కోరారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి విచ్చేసిన వాహనదారులకు, వాహన చోదకులకు సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు విడుదల చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీటీవో కిష్టయ్య

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'కోటపల్లి'

కోటపల్లి: మండలకేంద్రంలో ఆలూరి సత్తయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కోటపల్లి జట్టు గెలుపొందింది. గెలుపొందిన కోటపల్లి జట్టుకు రూ.15వేల నగదుతో పాటు బహుమతులను మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన కోటపల్లి బీ జట్టుకు రూ.8వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీ ప్రతాప్, మహేశ్‌ప్రసాద్, నీల మనోహర్, పాగుల సతీశ్, సుకేందర్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బెల్లంపల్లి(తాండూర్): ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తాండూర్ మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తంగళ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు జరిగాయి. ఉపన్యాస పోటీల్లో విశ్వభారతి ఉన్నత పాఠశాల విద్యార్థి విశ్వతేజ, వ్యాస రచన పోటీల్లో తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కావ్య ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ నెల 23న మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయనున్నారు.

కాసిపేట: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో టీఎస్ మోడల్‌స్కూల్ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని రమ్య ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానం, దేవాపూర్ డీఏవి విద్యార్థిని పూర్ణేశ్వరి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల దీక్ష విరమణ

నస్పూర్: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈ నెల 18 నుంచి చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులను తమ ఖాతాల్లో జమయ్యేలా చేయడం, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందేలా చేయడంతో పాటు ఇతర డిమాండ్లు సైతం రాబోయే రెండు నెలల్లో పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం అందించి వారిని దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శీపతి సుమతి, సురిమిల్ల వేణు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కొయ్యల వెంకటి, ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు మద్దెర్ల సతీష్, మాద్గుల రాజం, తదితరులు పాల్గొన్నారు.


నిమ్మరసం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

సేవ చేయడం గొప్ప విషయం

బెల్లంపల్లి: ఎలాంటి లాభాపేక్ష లేకుండా సాటి మానవులకు సేవ చేయడం గొప్ప విషయమని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చిన మార్చురీ వ్యాన్‌ను సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ఏసీపీ రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏసీపీకి శాలువా కప్పి నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఠాకూర్ గోపి కిషన్ సింగ్, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్ గౌడ్, టూటౌన్ ఎస్సై రమేష్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవా సమితి నాయకుడు కుడుపూడి కొండబాబు, వెల్డింగ్ షాపుల నిర్వాహకులు, మోటారు మెకానిక్‌లు, కాల్‌టెక్స్ వాసులు పాల్గొన్నారు.


మార్చురీ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ సదయ్య